## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) కృష్ణాజిల్లా నిర్వహణలో జరిగిన

# "భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు" అంశంపై జిల్లా సెమినార్ రిపోర్టు



సెమినార్‌లో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఎస్. ఝాన్సి; వేదికపై కామ్రేడ్స్ వెంకటరెడ్డి, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, తదితరులు

**4-8-2019, విజయవాడ :**
భారత విప్లవోద్యమనేత, మార్క్సిస్టు మేధావి కా॥తరిమెల నాగిరెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా విజయవాడలో ఐఎంఏ హాలులో "భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు" అంశంపై జిల్లా సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥వీరబాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ఎం.సుధాకర్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

సెమినార్‌లో మొదటగా రాజ్యహింసకు గురై అమరులైనవారికి, అనారోగ్యానికి గురై అమరులైనవారికి, అనేక విధాల దాడులలో మరణించిన దళితులు, మహిళలు, ఆదివాసీలు, మైనారిటీలకు సంతాపాన్ని తెలియజేస్తూ మౌనం పాటించారు.

మొదటగా సిపిఐ జాతీయ కంట్రోలు కమీషన్ సభ్యులు కా॥ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కా॥టిఎన్ వర్ధంతి సందర్భంగా ఈ అంశంపై సెమినార్ నిర్వహిస్తున్న సిపిఐ (ఎం-ఎల్)కు అభినందనలు తెలిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో తాను విద్యార్థి ఉద్యమంలో వున్నకాలంలో కా॥టిఎన్‌ను కలిసిన జ్ఞాపకాలను గుర్తుచేశారు. ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీలో టిఎన్‌కు చాలా గౌరవం వుండేదని, ఈ గౌరవం చీలిపోయాక కూడా ఉందని అన్నారు. వ్యక్తిగత జీవితంలో విలువలు, మంచి క్రమశిక్షణను పాటించారని, ప్రజలను ఆకర్షించే వ్యక్తిత్వం గలవారని అన్నారు.

ఈ సెమినార్ చాలా ముఖ్యమైనదని, అయితే ఆచరణ ఇంకా ముఖ్యమైనదని, ఐక్యకార్యాచరణను ముందుకు తీసుకు వెళ్ళటంలో భాగంగా జాతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఇప్పుడు జిల్లాస్థాయిలో సెమినార్లు నిర్వహించటం మంచి ప్రయత్నమని అన్నారు. "నరేంద్రమోడి పాలన తీరు సామ్రాజ్యవాదానికి, ప్రోకాపిటలిస్టు విధానం ఇది. సామ్రాజ్య వాదులకు జూనియర్ పార్టనర్‌గా వుంది. అందువల్ల తక్షణ కర్తవ్యాల్లో ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం, ప్రతిఘటించడం చేయాలి. అది ఐక్యకార్యాచరణ కావచ్చు, సంఘీభావం కావచ్చు. దీర్ఘకాలిక లక్ష్యంగా-సెమిఫ్యూడల్, ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయాలి. ఈ క్రమంలోనే సోషలిజానికి బాటలు వేసి, అంతిమంగా వర్గరహిత, కులరహిత సమాజాన్ని నెలకొల్పి-ఆ తర్వాత కమ్యూనిజానికి వెళ్ళాలి. భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తిచేయాలి. ఒక దేశంలో కమ్యూనిజం సాధ్యం కాదన్నది చరిత్ర నిరూపిస్తున్నది. ప్రపంచమంతా వ్యాపించాలి.

1857 నుంచి శాసనోల్లంఘన, క్విట్ ఇండియా, కయ్యూరు, తెభాగ, పునప్రవాయిలార్, తెలంగాణా, అజాద్‌హింద్‌ఫౌజ్ అనేక ఉద్యమాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చింది. బ్రిటీషువారు తమ దోపిడీ ప్రయోజనాలకోసం రైల్వేలు, పరిశ్రమలు నెలకొల్పారు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ దేశంలో సెమీఫ్యూడల్ సెక్షన్‌లు అనుసరించిన కాపిటలిస్టు పెట్టుబడిదారీ పంథాలో సోషలిస్టు దేశాల సహాయంతో ప్రభుత్వరంగంలో పరిశ్రమలు నెలకొల్పారు. సశ్యవిప్లవం ఫలితంగా పెట్టుబడిదారీ ధనిక రైతాంగం ఏర్పడి వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందుతూ వచ్చిందని మా అభిప్రాయం. మౌలికంగా ఈ దేశపు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పంథాను పెట్టుబడిదారులే డైరక్టు చేస్తున్నారు. ఈ దశలో పారిశ్రామిక కార్మికులను, వైట్‌కాలర్ వర్గాలను, స్కిల్ట్, అన్‌స్కిల్ట్ ప్రజలను, సంఘటిత, అసంఘటిత వర్గాలను కలుపుకు రావాలి. ఇప్పటికే ఉత్తరాదిలో, మహారాష్ట్రలో, రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలు వస్తున్నాయి. సోషలిజం గురించి, సోషలిజం విజయాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. భారత దేశంలో కమ్యూనిస్టులు టిఎన్ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని చెపుతూ ఆయన తన ప్రసంగం ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ఎస్. ఝాన్సీ మాట్లాడుతూ కా॥టి.ఎన్ గొప్ప మార్క్సిస్టు మేధావి అని అన్నారు. కా॥టిఎన్ ఏ పనినైనా మార్క్సిస్టు-లెనినిస్టుగా అన్వయించి ఎలా చేయాలో చేసి చూపిన నాయకుడని అన్నారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని అణచటానికి ఏ చట్టాలనైతే చేశారో 1947 తర్వాత అధికారాన్ని చేపట్టిన భారత పాలకులు కూడా అవే చట్టాలను రాజ్యాంగంలో పొందుపరుచుకొని ప్రజాఉద్యమ నాయకులను అణచివేస్తున్నారని వివరించారు. నిన్న, మొన్న కూడా లోకసభ, రాజ్యసభలో 'ఉపా' చట్టం ఆమోదించారని, దీనిద్వారా సంస్థల్నేకాకుండా వ్యక్తుల్ని కూడా టెర్రరిస్టులుగా గుర్తించటమేకాక ఆయా రాష్ట్రాల అనుమతి లేకుండా డైరక్టుగా కేంద్రప్రభుత్వమే ఆయా వ్యక్తులను అరెస్టు చేయటానికి

అధికారాన్ని ఈ చట్టంలో పొందుపర్చారని అన్నారు. ఈ చట్టాన్ని మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష ఎంపిలు ఎవరూ వ్యతిరేకించలేదని, అంటే బిజెపి అయినా, వైసిపి అయినా, టిడిపి అయినా వారి వైఖరి ఏమిటో తెలుస్తోందని అన్నారు. 1927లో చేసిన భారత అటవీచట్టాన్ని నేడు మరలా మరింత కఠినతరం చేయబోతున్నారని అన్నారు. ఆర్‌టిఐ యాక్టులో అనేక మార్పులు చేశారని అన్నారు. అంతేకాక కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 4 కోడ్‌లను పెట్టారని ఫలితంగా 8 గం॥ల పనిదినాలు కోల్పోతారని, మహిళా కార్మికులకు రక్షణ వుండదని అన్నారు. 'కాఫీడే' సిద్ధార్థ ఆత్మహత్య పారిశ్రామికవేత్తల సంక్షోభాన్ని తెలియజేస్తుందని అన్నారు.

సెమినార్ 'కీనోట్'ను ఆమె వివరిస్తూ నిలకడైన ఒక ఐక్యకార్యాచరణను నిర్మించు కుంటేనే ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయగల్గుతామన్నారు. "ప్రస్తుత వ్యవస్థను అర్థవలస, అర్థఫ్యూడల్ అని మన పార్టీ అభిప్రాయం. వ్యవసాయరంగంలో మార్పులు కొన్ని వచ్చినప్పటికీ వాటిని ఉపరితల అంశాలుగానే తీసుకోవాలి. భూమిపై పనిచేస్తున్న వారి చేతుల్లో భూమిలేదు. బానిస సమాజ లక్షణాలే -ఫ్యూడల్ వ్యవస్థలోనూ కొనసాగు తున్నాయి. భారతదేశంలో మతతత్వాన్ని తెచ్చిన బ్రిటీషు వలసవాదుల లక్షణాలను కాంగ్రెస్, బిజెపిలు కొనసాగిస్తున్నాయి. భారతదేశంలో ఫ్యూడల్‌శక్తులు, బూర్జువా వర్గాలు అందరూ సామ్రాజ్యవాదులకే దళారులుగా వున్నారు. ఈ దశలో భారత విప్లవం రెండు దశలుగా సాగుతుంది. అవి: 1. నూతన ప్రజాస్వామిక విప్లవం 2. సోషలిస్టు విప్లవం, అంతిమంగా కమ్యూనిస్టు విప్లవం. కనుక ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా అందరూ కలసి ఉద్యమాలు చేయాలి. ఈ విషయంలో కలసి వచ్చే మేధావులను అందర్నీ కలుపుకు రావాలి. మార్క్సిజం-లెనినిజంపై దాడులను ఖండించాలి.

అన్నిరంగాల్లో సంక్షోభం చాలా తీవ్రంగా వుంది. దీనినుంచి బయటపడటానికి ప్రజలు మన పిలుపుకోసం, ఐక్యకార్యాచరణకోసం ఎదురు చూస్తున్నారు. మార్క్సిజాన్ని అన్వయించటంలో వచ్చే విభేధాలే చీలికలకు కారణమవుతున్నది. ఈ వ్యవస్థ మార్పుకోసం కలసి పనిచేయాలి. ఈ దశలో మనల్ని మనం తిట్టుకోవటం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంకోసం బలమైన ఐక్యకార్యాచరణ ఉద్యమాన్ని నిర్మించాలని చెపుతూ ఆమె ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) ఎన్‌డి నాయకులు కా॥పోలారి మాట్లాడుతూ కా॥ టిఎన్ పేరు చెప్పగానే తాకట్టులో భారతదేశం గ్రంథం గుర్తుకు వస్తుందని, నేడు దేశం తాకట్టులోనే వుందని అన్నారు. ప్రజాఉద్యమాలే లక్ష్యంగా ఐక్యకార్యాచరణ సాగాలని, ఐక్యత క్రిందినుంచి రావాలని, ప్రజాసంఘాలద్వారా ప్రజాసమస్యలు తీసుకొని ముందుకు సాగాలని, ఈ క్రమం అభివృద్ధికాకుండా ప్రజాపోరాటాలను అభివృద్ధి చేయలేమని అన్నారు. కేంద్రం నిర్బంధ చట్టాలను మందబలంతో చేస్తోందని, ఎమర్జెన్సీ పేరు పెట్టకుండా ప్రత్యర్థులపై దాడి చేయటానికి చట్టాలను తెచ్చిందని, ఈ దశలో వర్గ ఐక్యత కావాలని, ఈ సమాజాన్ని అర్థవలస, అర్థ భూస్వామ్య వ్యవస్థ అని భావిస్తున్నామని, విప్లవానికి మార్గం ఏమిటన్నది చర్చ సాగుతున్నదని, ఐక్యత సాగాల్సి వుందని, ప్రజాసంఘాలనుంచి ఐక్యత సాగించాలి అని చెపుతూ ముగించారు.

సిపియం రాష్ట్రనాయకులు కా॥వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదన్నారు. "ఈ సిద్ధాంతాల పేరుతో ఒకరి నొకరం ముద్రలు వేసుకున్నాము. ఇవన్నీ స్వీయాత్మకమైనవి. అందరి లక్ష్యం వ్యవస్థను మార్చాలన్నదే. పాలకవర్గాలను అంచనా వేయటంలోను, దేశ స్వాతంత్ర్యంపట్ల అంచనా ల్లోను తేడాలున్నాయి. ఫ్యూడలిజంమీద, పెట్టుబడిదారీ విధానం మీద అంచనాల్లో తేడాలున్నాయి. ఎవరి అభిప్రాయాలు వారి కున్నాయి. బడాబూర్జువా నాయకత్వంలో వున్న బూర్జువావర్గం ఇది. సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయింది. ఈ దశలో సంఘటిత, అసంఘటిత కార్మికులను, వర్కర్లను ఆర్థిక పోరాటాలకే పరిమితం చేస్తే ఆర్థిక చైతన్యమే వస్తుంది. రాజకీయ చైతన్యాన్ని కల్పించకపోతే బూర్జువా పార్టీల భ్రమల్లో వారి చుట్టూనే తిరుగుతారు. కమ్యూనిస్టులు రాజకీయ సైద్ధాంతిక పోరాటాలు చేపట్టాలి. ఐక్యకార్యాచరణ కొనసాగించాలి అని ఆయన అన్నారు. కా॥టిఎన్ తరం నాయకులకు సిద్ధాంతానికి, ఆచరణకు వ్యక్తిగత జీవితానికి లింకు వుందని అన్నారు. ఇది సముచితమైన సెమినార్ అని ఐక్యకార్యాచరణ సాగాలని ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు కా॥సత్యన్నారాయణ మాట్లాడుతూ కా॥తరిమెల నాగిరెడ్డి గారికి తమ పార్టీ తరపున రెడ్‌శాల్యూట్స్ చెప్పారు. "గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొన్నాము. కేంద్ర స్థాయి, రాష్ట్రస్థాయి, వివిధ జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న సెమినార్‌లు విజయవంతం కావాలని కోరుకుంటున్నాము. చాలా విషయాల పట్ల ఐక్యకార్యాచరణ చేస్తున్న మనం ఎన్నికల విషయాలలో ఏకంగా లేము. పాలకవర్గాలను బహిర్గతం చేయటంకోసం మనమందరం కలసి ఛాలెంజ్‌గా నిలబడాల్సిన చోట కామన్‌గా అంగీకారం వున్న వాటిని ఉపయోగించు కోవటంలేదు. ఎవరికి వాళ్ళం కీచులాటలు, ఎగతాళి, హేళనలు, పెద్దన్న పాత్రలు వహిస్తున్నారు. 100 మంది జనం ఎక్కువ తెచ్చుకోగానే స్టేజిఅంతా తమదే అన్నట్లు మిగిలిన భాగస్వాములను కనిష్ట స్థానంలో వుంచుతూ సంకుచితమైన మనస్తత్వాన్ని కలిగి వుంటున్నారు. శత్రువులను ఎదుర్కోవాల్సిన పరిస్థితుల్లో ముసుగులు తీసేసి పోరాడాల్సిన మనం ముసుగులు వేసుకోవద్దు". ఈ కుహనా సంస్కృతిని, జాతీయవాదాన్ని అంగీకరించబోమని, వివిధ స్థాయిల్లో కలసివచ్చే వారిని కలుపు కుంటూ ముందుకు వెళ్దామని చెబుతూ ఆయన ముగించారు.

ఎంసిపిఐ రాష్ట్రకార్యదర్శి కా॥వెంకటరెడ్డి మాట్లాడుతూ ముందుగా కా॥టిఎన్‌కు జోహార్లు తెలిపారు. "ప్రస్తుత సెమినార్ అంశంమీద మాట్లాడే సందర్భంలో సైద్ధాంతిక అంశాలను ముందుకు తెచ్చారు. ప్రస్తుత రాజ్యాంగం ప్రజావ్యతిరేకమైనది అన్నారు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాము. ఇది అర్థవలస అన్నారు. కానీ, ఇది అర్థవలస కాదని మా నిశ్చిత అభిప్రాయం. గుత్తపెట్టుబడిదారీ బడాభూస్వామ్య వర్గం మీద ఆధారపడింది. దళారీ ప్రభుత్వం కాదు. దళారీ స్వభావం కల్గిన ప్రభుత్వం. సోషలిజం

సాధన, కమ్యూనిస్టు సమాజస్థాపనే లక్ష్యం మనందరిదీ. గుర్తించిన ప్రజాసమస్యల మీద కలసి పోరాడటానికి ఎర్రజెండాలన్నీ కలసి పోరాడాలని ఆయన ముగించారు. సెమినార్‌లో ప్రవేశపెట్టిన కీనోట్‌పై సభికులు తమతమ అభిప్రాయాలు తెలిపారు.

వచ్చిన వివిధ అభిప్రాయాలను క్రోడీకరించి ముగింపుగా సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ఎస్.ఝాన్సీ మాట్లాడారు. సరైన లోతైన అవగాహనతో ఐక్యకార్యాచరణ వుండాలని కోరుతున్నామన్నారు. ప్రాతిపదిక లేకుండా ఆచరణలోకి వెళ్ళలేమని అన్నారు. దళితులు, మైనార్టీలు, మహిళలపై జరిగిన దాడులకు ఎక్స్‌గ్రేషియాతో కొట్టుకుపోకుండా ఈ దాడులకు కారణాలు ఏంటి? వ్యవస్థకు దాడులకు గల సంబంధం ఏమిటి? మరొకసారి జరగకుండా ఏమి చేయాలో ప్రజలను చైతన్యపరచాలన్నారు. ప్రజలు పోరాడుతున్న సందర్భాలలో ప్రభుత్వం చట్టాలు చేస్తోంది. ఈనాటికీ చేస్తూనే వుంది. చట్టాలు లేకపోవటంవల్లనే మహిళలు, దళితులు, ఆదివాసులపై దాడులు జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు. రాజ్యం దోపిడీ పాలకవర్గాల చేతిలో ఆయుధం అని లెనిన్ మహాశయుడు ఏనాడో వివరించాడని అన్నారు. వర్గాలు లేనప్పుడు రాజ్యం అవసరం వుండదు. దోపిడీ వర్గం లేని వ్యవస్థను మనమందరం సాధించు కోవాల్సి వుందని అన్నారు. సెమినార్‌లో చాలా మంది కామ్రేడ్స్, కమ్యూనిస్టు అభిమానులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పాల్గొనటం సంతోషంగా వుందని అన్నారు. సరైన ఐక్యకార్యాచరణను ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తూ ఈ సెమినార్‌ను ముగించారు. సెమినార్‌లో ప్రజాకళాకారులు విప్లవగేయాలు ఆలపించారు.

oooo